క్లుప్తంగా

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఏలూరు రూరల్: దేశ ఆర్థికాభివృద్ధి, సామాజిక పురోగతిలో యువత భాగస్వాములు కావాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి దూలం కిషోర్ అన్నారు. మంగళవారం ఎన్వైకే ఆధ్వర్యంలో ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మై భారత్ వికసిత్ 2047 అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. సహజ అభివృద్ధి, పర్యావరణ స్థిరత్వం, సుపరిపాలన ప్రమాణికంగా దేశం అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధిస్తుందని కిషోర్ చెప్పారు. అనంతరం విద్యార్థులకు పలు అంశాలపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గుర్రాల దీపిక ప్రథమ, విశాల్‌కుమార్ ద్వితీయ, ప్రజ్ఞ అంబేద్కర్ తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.గిరిబాబు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వి.వెంకటరావు, ఎస్ పరమేష్, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోండి



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న పీటీఎల్‌యూ నాయకుడు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సంక్రాంతి సెలవు దినాల్లో తరగతులు నిర్వహించే ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారిని కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో డీఈఓ పి.శ్యామ్ సుందర్‌కు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దిద్దే అంబేద్కర్, ఏలూరు జిల్లా కార్యదర్శి టి.ప్రేమ్ కుమార్ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించినప్పటికీ విద్యార్థులకు, సిబ్బందికి సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహించడం లేదా సిబ్బందితో ప్రచారం చేయించడం లేదా వర్క్‌షాప్ పేరుతో వేధించడం వంటి పనులు చేయిస్తున్నారని పేర్కొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి పోటీలు

ఏలూరు రూరల్ : నేటి నుంచి ఏలూరు రూరల్ మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బి.ప్రణవి తెలిపారు. ఎంపీపీ పెన్మత్స శ్రీనివాస రాజు అధ్యక్షతన ఉదయం 8 గంటలకు చాటపర్రు జెడ్పీ పాఠశాలలో పోటీలు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 7 రోజుల పాటు వివిధ గ్రామాల్లో చేపట్టబోయే ఈ పోటీల్లో 11 సచివాలయ జట్లు పాల్గొంటాయని వివరించారు. కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చేతుల మీదగా సచివాలయ జట్లుకు స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ చేశామన్నారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో చాటపర్రు, గుడివాకలంక జెడ్పీ పాఠశాలలో వాలీబాల్ పోటీలు, మాదేపల్లి జెడ్పీ పాఠశాలలో బ్యాడ్మింటన్, సర్ ఆర్‌ఆర్‌కళాశాల ఆట స్థలంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తామన్నారు. సంక్రాంతి సెలవులు తర్వాత ఈ నెల 17, 18, 19, 20 తేదీల్లో రెండో దఫా నాలుగు రోజుల పాటు పోటీలు కొనసాగిస్తామని తెలిపారు. ఇప్పటికే సచివాలయ స్థాయిలో ఉత్సాహంగా నిర్వహించామని గుర్తు చేశారు.

ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత

పెదవేగి : ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీనికోసం అవసరమైన నిధులను అందిస్తున్నామని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన హేమలత, రాణికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.15వేల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందించారు. అంకన్నగూడెంకు చెందిన 14 మంది రైతులకు జగనన్న దళిత సంపూర్ణ భూహక్కు పథకంలో అసైన్డ్ భూముల పట్టాలను ఎమ్మెల్యే అందించారు. అంకన్నగూడెం సర్పంచ్ దుక్కిపాటి మహాలక్ష్మిడు, కవ్వగుంట సర్పంచ్ మద్దాల వాణి, నాయకులు నాగయ్య పాల్గొన్నారు.

ఏలూరు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

రూ.3.93 కోట్ల పనులకు ఎమ్మెల్యే నాని శంకుస్థాపన

ఏలూరు టౌన్: ఏలూరు నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నామని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు నగరంలో మంగళవారం 47వ డివిజన్‌లో రూ.94 లక్షల వ్యయంతో 17 సీసీ రోడ్లు, 3 డ్రెయినేజీలు, 48వ డివిజన్‌లో రూ.90 లక్షలతో 9 సీసీ రోడ్లు, 10 డ్రెయినేజీలు, 49వ డివిజన్‌లో సుమారుగా రూ.1.15 కోట్లతో 24 సీసీ రోడ్లు, 4 డ్రెయినేజీలు, 50వ డివిజన్‌లో రూ.94.12 లక్షలతో 6 సీసీ రోడ్లు, 1 డ్రెయినేజీ, 1 సామాజిక భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు నగరంలో ఇప్పటికే పెద్దెత్తున సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టామన్నారు. 47, 48, 49, 50 డివిజన్ల పరిధిలో 56 సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని తెలిపారు. మరో 18 డ్రెయినేజీలు, ఒక కమ్యూనిటీ హాలు సైతం నిర్మిస్తామన్నారు. నగరంలోని ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ హయాంలో మంచి చేసేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేయిస్తున్నామని వివరించారు. మేయర్ షేక్ నూర్జహాన్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, కార్పొరేటర్లు సున్న స్వాతిశ్రీదేవి, దేవరకొండ శ్రీనివాసరావు, పార్టీ క్లస్టర్-1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, బీసీ నాయకులు కిలాడి దుర్గారావు, నాయకులు పొలిమేర హరికృష్ణ, కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ ఉన్నారు.



ఏలూరు టౌన్: 48వ డివిజన్‌లో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాని, చిత్రంలో నూర్జహాన్, శ్రీలక్ష్మి



ఏలూరు టౌన్: దివ్యాంగురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

దివ్యాంగురాలిని పరామర్శించిన నాని

ఏలూరు తంగెళ్లమూడి పోస్ట్ ఆఫీస్ రోడ్డు వీధికి చెందిన దివ్యాంగురాలు షేక్ కరిమా తన సమస్యలను 2023 జూన్ 25న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నానికి వివరించారు. ఆ సమయంలో ఎమ్మెల్యే నాని రూ.5 వేల పెన్షన్ మంజూరు చేయించి, 2023 అక్టోబర్ 1వ తేదీన స్వయంగా ఇంటికి వెళ్లి అందజేశారు. మరోసారి మంగళవారం డివిజన్ పర్యటిస్తూ ఆమెను యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే నానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



ఏలూరు రూరల్ : మహిళలకు బీమా పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నాని

పేదలకు వైఎస్సార్ బీమా అందజేత

ఏలూరు రూరల్ : నగరంలో ప్రతి పేద కుటుంబాన్ని ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రత్యేక శ్రద్ధతో ఆదుకుంటున్నారని కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. 15వ డివిజన్‌లో గొల్లపల్లి దేవి, నిడిగట్ల అచ్చాయమ్మ భర్తలు ఇటీవల మృతి చెందారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో వైఎస్సార్ బీమా పథకంలో రూ.1 లక్ష చొప్పున మంజూరు చేయించారని చెప్పారు. వీరికి మంగళవారం ఎమ్మెల్యే నాని వైఎస్సార్ బీమా నగదు అందజేశారని తెలిపారు.

స్వచ్ఛ ఏలూరుకు బాటలు

- చెత్త, వ్యర్థాలపై నిరంతర పర్యవేక్షణ
- 10 చోట్ల లౌడ్‌స్పీకర్ల ఏర్పాటు
- 15 ప్రాంతాల్లో సీసీ కెమెరాలు
- కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షణ

ఏలూరు టౌన్: ఏలూరు నగరాన్ని అభివృద్ధి చేయటంతోపాటు స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని సారథ్యంలో మేయర్ షేక్ నూర్జహాన్ ఆధ్వర్యంలో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు. నగరంలో ఇష్టారాజ్యంగా రోడ్లు, కాలువలు, డ్రెయినేజీల్లో చెత్త, వ్యర్థాలను వేయకుండా నిఘా పెట్టారు. ఏడాది క్రితమే నగరంలోని గోదావరి కాలువను శుభ్రం చేసిన నేపథ్యంలో మరోసారి చెత్తను వేయకుండా శ్రద్ధ పెట్టారు. నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ నూతన విధానానికి శ్రీకారం చుట్టారు.

చెత్త వేయకుండా పర్యవేక్షణ

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని 10 ప్రాంతాల్లో లౌడ్ స్పీకర్లు, మరో 15 ప్రాంతాల్లో అత్యంత నిశితంగా గమనించే పోలార్డ్ టిక్ట్ జూమ్ (పీటీజెడ్) కెమెరాలను ఏర్పాటు చేశారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతం రైతుబజార్, కర్రల వంతెన, పాతబస్టాండ్ ప్రాంతం, గూడ్స్ షెడ్ రోడ్డు, తంగెళ్లమూడి సెంటర్, బాలయోగి వంతెన, మినీబైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఈ పీటీజెడ్ కెమెరాలతో అరకిలోమీటర్ మేర నిశితంగా గమనించేలా ఉండటమే వీటి ప్రత్యేకత. ఇష్టారాజ్యంగా చెత్తను, వ్యర్థాలను రోడ్లపై వేస్తే వెంటనే గుర్తించి చర్యలు చేపడతారు.

కమాండ్ కంట్రోల్ రూమ్

నగరపాలక సంస్థ పాత భవనంలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ ఇద్దరు సిబ్బందిని పర్యవేక్షణ చేసేలా నియమించారు. రోజూ ఉదయమే నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పారిశుధ్య కార్మికుల పనితీరును పర్యవేక్షిస్తూ.. అవసరమైన సూచనలు చేస్తారు. లౌడ్‌స్పీకర్లతో నగరపాలక సంస్థకు సంబంధించి ముఖ్యమైన ప్రకటనలు సైతం ప్రజలకు తెలిసేలా రికార్డ్ చేసి వినిపించేలా ఏర్పాట్లు చేశారు. పన్నుల చెల్లింపులు, ఇతరత్రా ప్రకటనలు లౌడ్ స్పీకర్ల ద్వారా ప్రకటించనున్నారు.



కార్పొరేషన్ కార్యాలయం రోడ్డులో ఏర్పాటుచేసిన లౌడ్ స్పీకర్, సీసీ కెమెరా



కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కూరగాయల మార్కెట్ ప్రాంత పర్యవేక్షణ



కార్పొరేషన్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్



పాతబస్టాండ్ సెంటర్ ప్రాంతంలో పర్యవేక్షణ ఇలా

ప్రజల సహకారం అవసరం



ఏలూరు నగరాన్ని చెత్త, వ్యర్థాలు లేకుండా పరిశుభ్రంగా ఉండేలా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తున్నాం. ఇప్పటికే నగరంలోని పలు ప్రాంతాల్లో 10 లౌడ్ స్పీకర్లు, 15 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. చెత్తను రోడ్లపై అధికంగా వేస్తున్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఇష్టారాజ్యంగా చెత్తవేస్తే అపరాధ రుసుము విధిస్తాం. నగర పరిశుభ్రతకు ప్రజలు సహకారం అవసరం.

– సంక్రాంతి వెంకట కృష్ణ, ఏలూరు నగర కమిషనర్

విద్యుత్ ఇంజినీర్లకు న్యాయం చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో వివిధ విద్యుత్ సంస్థల్లో జూనియర్ ఇంజినీర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ శేషారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ హాలులో ఆ సంఘ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి సంఘ జిల్లా అధ్యక్షుడు ఎ.ఉమా మహేశ్వరరావు అధ్యక్షత వహించగా, శేషారెడ్డి, ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజులు మాట్లాడారు.

ఎంటీఎస్ టీచర్లను రెగ్యులర్ చేయించండి



సజ్జల రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు


ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో మినిమమ్ టైమ్ స్కేల్ ఉపాధ్యాయుల సర్వీసును రెగ్యులర్ చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సిఫార్సు చేయాలని ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. విజయవాడలోని సజ్జల క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఏలూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వాలు తమను నిర్లక్ష్యం చేసినా డీఎస్సీ అర్హత సాధించిన 25 సంవత్సరాల అనంతరం సైతం తమకు ఉద్యోగాలు కల్పించిన సాహసవంతుడు ముఖ్యమంత్రి జగన్ అని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ కొనియాడారు. సీఎం సాహసోపేత నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా 4600 కుటుంబాలు సంతృప్తికరంగా జీవిస్తున్నాయని వివరించారు. సర్వీసులను రెగ్యులర్ చేసి తమ జీవితాల్లో మరిన్ని వెలుగులు నింపాలని కోరారు. సజ్జలను కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు కె.స్వామిదాసు, ఎ.రాజు, ఎండీ పాషా, ఎం అమరావతి, ఎం మరియమ్మ, సీహెచ్ వాహిని ప్రియ, ఎస్ శారారాణి, డి.స్వరూప రాణి, బి.శర్మ తదితరులు ఉన్నారు.

నేడు వక్తృత్వ పోటీలు

ఏలూరు టౌన్: విజయవాడ స్వరాజ్యమైదానంలో 125 అడుగుల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్న నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో విద్యార్థులు, యువతకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్టు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. ఉదయం 10గంటల్లోపు ఏలూరు కార్పొరేషన్ పీఓ కృష్ణమూర్తి వద్ద తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రథమ, ద్వితీయ బహుమతులుగా రూ.3 వేలు, రూ.వెయ్యి అందజేస్తామని, మూడు విభాగాలకు వేర్వేరుగా బహుమతులు, నగరపాలక సంస్థ ప్రశంసా ప్రతాలను అందజేస్తామని తెలిపారు. ఇంటర్ లేదా పైస్థాయి విద్యార్థులకు ఆర్థిక వేత్తగా డాక్టర్ అంబేడ్కర్ అనే అంశంపైనా, విద్యార్థినులకు సామాజిక ఉద్యమకారునిగా డాక్టర్ అంబేడ్కర్ అనే అంశాలపై వక్తృత్వ పోటీలు ఉంటాయని వివరించారు. రెండో విభాగంలో యువకులకు అంబేడ్కర్ కుల నిర్మూలన, యువతులకు అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాణం అనే అంశాలపై వక్తృత్వ పోటీలు ఉంటాయన్నారు. మూడో విభాగంలో 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు అంబేడ్కర్ ఆలోచనలు అనే అంశంపై, విద్యార్థినులకు అంబేడ్కర్ రచనలు, ముఖ్యాంశాలు అనే అంశాలపై పోటీ ఉంటుందని నగర కమిషనర్ తెలిపారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు

ఏలూరు (ఆర్‌ఆర్ పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, నిత్య కల్యాణ మహోత్సవం నిర్వహించారు. స్వామి వారికి విశేష నవనీత (వెన్నతో) అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తాళ్లపూడికి చెందిన తల్లాప్రగడ రామకృష్ణ శాస్త్రి (జూనియర్ ఉషశ్రీ) శ్రీమద్రామాయణ మహత్యం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. నగరానికి చెందిన నాట్య కళాకారిణులు చిట్టిబోయిన రేహజ్ఞ, నవ్యశ్రీ ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అబ్బురపరిచాయి. రాత్రి స్వర్ణ నృత్యాలయం ఆధ్వర్యంలో నాట్యాచారిణి కె.స్వర్ణలత శిష్య బృందం కూచిపూడి నాట్య విన్యాసాలతో ఆకట్టుకున్నారు.



వేంకటేశ్వర స్వామి



చిట్టిబోయిన రేహజ్ఞ, నవ్యశ్రీల కూచిపూడి నృత్యం

రేషన్ షాపులపై విజిలెన్స్ అధికారుల దాడి



రేషన్ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

భీమడోలు: భీమడోలులోని రేషన్ దుకాణాలపై అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. ఇద్దరు రేషన్ షాపు డీలర్లు, మరో ఇద్దరు వెహికల్ డ్రైవర్లపై 6 ఏ కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ సీఐ శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో కానిస్టేబుల్స్ భీమడోలులోని కె.దుర్గాపల్లవి, ఎం.వెంకటరత్నం దుకాణాల్లో ఆకస్మిక దాడులు చేసి రికార్డులను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు, నిల్వ ఉన్న స్టాక్‌కు భారీగా వ్యత్యాసాలను గుర్తించామన్నారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వినియోగదారులు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలకు అందించే 3,450 కేజీల ఫోర్టిఫైడ్ రైస్ తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. చక్కెర 19 కేజీలు, కందిపప్పు 100 కేజీలు తేడా ఉన్నాయని తేల్చారు. గ్రామంలోని వెహికల్ డ్రైవర్లు జి.విజయరత్నం, పి.నాగమహేష్‌కు చెందిన వాహనాల్లో సరుకుల్లో తేడా ఉన్నాయి. 1,150 కేజీల బియ్యం, గోధమ పిండి 33 కేజీలు, చక్కెర 72 కేజీలు తేడా ఉన్నట్లు గుర్తించి అధికారులు వారి రికార్డులను సీజ్ చేశారు. రేషన్ షాపుల నుంచి అక్రమంగా సరుకులు పక్కదారి పట్టినట్లు అధికారులు గుర్తించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామ స్వరాజ్యం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ విజయరాజు



శిక్షణా తరగతులకు హాజరైన అధికారులు

ఏలూరు(మెట్రో): ప్రజల భాగస్వామ్యంతో గ్రామ పంచాయతీ పాలన జరిగితేనే నిజమైన గ్రామ స్వరాజ్యమని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. విస్తరణ అధికారులు, మండలం ప్రజా పరిషత్ పరిపాలన అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, మండల స్థాయి కోఆర్డినేటర్స్‌కు ఏలూరు జిల్లా పరిషత్‌లో రెండు రోజుల శిక్షణ తరగతులను జెడ్పీ సీఈఓ వెంకట సుబ్బారావు ప్రారంభించారు. డీపీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిపాలనలో పారదర్శకత తీసుకొచ్చేందుకు, ప్రజా భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి ప్రణాళికలు చేయాలన్న ప్రభుత్వ ఉద్దేశం ఈ శిక్షణ తరగతుల ద్వారా సిబ్బంది నెరవేర్చాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు శాఖలవారీగా అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధి ప్రణాళికలు తయారీలో మహిళా భాగస్వామ్యం ఉండాలన్నారు. గ్రామీణ నీటి యాజమాన్య సంస్థకు చెందిన రాము మాట్లాడుతూ ఉపాధి గ్రామీణ హామీ పథకం అమలుకు ముందస్తు ప్రణాళికలు అవసరమని తెలిపారు. నగదు రహిత కార్యక్రమాలు, ప్రజా ప్రణాళిక ఉద్యమ లక్ష్యాలు, ప్రణాళికల తయారీలో అధికారుల పాత్ర, గ్రామ పంచాయతీ ఫంక్షనల్ కమిటీల ఏర్పాటు, జీపీడీపీ అమలు నివేదిక, బాల సభ, మహిళా సభ నిర్వహణ, ఈ గ్రామ స్వరాజ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ మేనేజర్ ప్రత్సంగి రాజు, డీఎల్‌పీఓలు చంద్ర శేఖర్, రాజాఉల్లాహ్, సుందరి, డీపీఎం పులి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రామాంజనేయులు

దెందులూరు: గోపన్నపాలెం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఏనుగు రామాంజనేయులు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు మంగళవారం నియమితులయ్యారు. నూతన అధ్యక్షుడు రామాంజనేయులు రాత్రి వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, పార్టీ మాజీ అధ్యక్షుడు వీరంకి సత్యనారాయణ, పార్టీ నాయకులు తోట పద్మారావు, మాగంటి కృష్ణమోహన్, మోర్ల సుబ్బారావు, పసుమర్తి శ్రీను, మోదుగుమూడి నాగలింగేశ్వరరావు, కడిమి ఆంజనేయులతో కలిసి ఎమ్మెల్యే కార్యాలయంలో కొఠారు అబ్బయ్యచౌదరిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వీరాంజనేయులను మెడలో పార్టీ కండువా వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన అధ్యక్షుడిని వైఎస్సార్ సీపీ నాయకులంతా సత్కరించారు.

వేంపాడులో ఆక్రమణల తొలగింపు

ద్వారకాతిరుమల: మండలంలోని వేంపాడులో ప్రధాన రహదారి పక్కనున్న ఆక్రమణలను అధికారులు మంగళవారం తొలగించారు. డ్రెయినేజీల నిర్మాణానికి పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో ఈ పనులను చేపట్టారు. అయితే స్థానికులు కొందరు ఈ పనులను అడ్డుకునేందుకు ప్రయత్నించగా తహసీల్దార్ పి.సతీష్, భీమడోలు సీఐ భీమేశ్వర రవికుమార్, ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ దగ్గరుండి జేసీబీల సహాయంతో ఆక్రమణలను తొలగింపజేశారు. ఈ పనులు రాత్రి వరకు కొనసాగాయి.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	28
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	23
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	34
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	25
ద్వారకాతిరుమల –ఏలూరు– బీహెచ్ఈఎల్	22.15	4802	36
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	రద్దు
ఏలూరు –తిరుపతి	16.00	4830	రద్దు